# కలలు కను కానీ...!

వాణిశ్రీ

వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చెయ్యమన్నారు మన పెద్దలు. ఇదేం మనిషి? 'మీ అబ్బాయికి పిల్లనిస్తామని వస్తే, అబ్బే మావాడింకా సెటిల్ కాలేదు. ఉద్యోగం సద్యోగం లేదు. వెధవ ఇంటర్ తప్పాడు. అందులో రెండు సబ్జెక్టులు పూర్తి చెయ్యలేకపోయాడు. చదువు వంటబట్టకపోతే పోయింది. కనీసం ఏ టైలరింగో, వడ్రంగమో, తద్దినాలో, శ్రాద్ధమో పెట్టడం నేర్చుకుంటే బతికిపోతాడు గదా! ఉహూ.. ఏదీ నేర్చుకోడు. దేని మీదా శ్రద్ధ లేదు. ఎంతసేపూ ఊరెమ్మట బలాదూర్ తిరుగుతుంటాడు. ఏ వెధవో ఫోన్ చేస్తాడు. ఇక అంతే సంగతులు. 'అరె వచ్చేస్తున్నారా! ఆ సెంటర్లో ఉండు' అని తుర్రుమంటాడు. బాధ్యత లేనోడికి ఏం పెళ్లి చేస్తావండీ? వీడికే తిండి పెట్టలేక చస్తుంటే, పెళ్లి చేసి వీడి పెళ్లాన్ని గూడా పోషించనా?'

వెంకట్‌కి పిల్లనివ్వడానికి వచ్చిన వాళ్లతో చెప్తున్నాడు హరినారాయణ.

ఇంట్లో ఉన్న వెంకట్‌కి వంటి మీద తేళ్లు, జెర్రులు పాకుతున్నట్లు, కారం పూసుకున్నట్లు మండిపోతోంది.

ఛీ..ఛీ.. ఈయనసలు తండ్రేనా?

గిట్టని వాళ్లెవరైనా ఇటువంటి మాటలు చెప్పి వచ్చిన పెళ్లి సంబంధాలను చెడగొడితే అది సహజం అని సరిపెట్టుకోవచ్చు. కన్న తండ్రే మావాడొట్టి బడుద్ధాయి. పెళ్లాన్ని పోషించలేని అసమర్థుడు అని వాళ్లతోనే చెప్తుంటే, తలకాయలో మెదడున్న వాడెవడైనా తన కూతుర్నిస్తాడా? వీడికిచ్చి పెళ్లి చెయ్యడం కంటే పిల్లని ఏ బావిలోనో తోసేస్తే సుఖం అనుకోడూ!

"మా పెద్దాడికీ వీడికీ పోలికే లేదండీ. వాడు కష్టపడి చదువుకున్నాడు. అమెరికా వెళ్లి లక్షలు సంపాదిస్తున్నాడు. అందుకే లీడింగ్ లాయర్ విశ్వనాథం గారు మా ఇంటి చుట్టూ తిరిగాడు మీ అబ్బాయికి మా అమ్మాయినిస్తామని. వాడికి ఎంత కట్నం ఇచ్చారో చెప్తే మీరు కళ్లు తిరిగి పడిపోతారు. మిమ్మల్ని పడగొట్టడం 'నాకిష్టం లేదు. అందుకే చెప్పను"

హరినారాయణ మాటలు వెంకట్ చెవుల్లోకి తూటాల్లా వచ్చి దూరుతుంటే భరించలేక, హడావుడిగా ఇంట్లో నుంచి బైటపడ్డాడు.

"చూశారుగా వాడి వేషం? టింగురంగా అంటూ పెద్ద హీరోలా బయల్దేరాడు. చూడ్డానికి దొరబాబు వేషం వాడునూ! వాళ్లన్నని పీడించి డాలర్లు తెప్పించుకుంటాడు. డబ్బంతా డ్రెస్సులకీ బూట్లకీ నాశనం చేస్తుంటాడు. నెత్తిన రూపాయి పెట్టినా అర్ధరూపాయి విలువ చెయ్యడు. వాడి నాటకాలు చూసి పెద్ద హీరో అనుకుంటున్నారేమో? వాడుట్టి జీరో!"

వెంకట్‌కి వెనుక నుంచి తండ్రి అంటున్న మాటలు వినిపిస్తున్నాయి. ఆ మాటలు భరించలేక పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ సరాసరి రిహార్సల్ హాల్‌కు వెళ్లిపోయాడు.

డైరెక్టర్ దొంగ సత్యంతో తన గోడు వెళ్లబోసుకున్నాడు.

"మీ ఫాదర్‌కి పెద్ద ఆఫీసర్‌నని ఫోజు లేరా! ఈ ఆఫీసర్లంతా అంతే తామేదో గొప్ప వాళ్లం అనుకుంటారు. ఏదో ఒకరోజు మనకీ మంచి రోజులొస్తాయి. 'మంచివాళ్లకి మంచి రోజులు' టైటిల్ అదిరింది కదూ!" అన్నాడు దొంగ సత్యం.

వెంకట్ తల ఊపాడు.

నాటిక రిహార్సల్ పూర్తయ్యాక ఇంటికెళ్లాడు. రాత్రి భోజనం చేశాక గుడికెళ్లి కాలక్షేపం చేసి రావడం హరినారాయణ అలవాటు. తండ్రి ఇంట్లో లేనప్పుడు తల్లిమీద ఎగరడం వెంకట్‌కి మంచి నీళ్లు తాగినంత ఈజీ. తండ్రి ముందు పిల్లి, తల్లి ముందు పులి.

"అసలేమనుకుంటున్నాడు? పిల్లనివ్వడానికి వచ్చినవాళ్ల ముందు ఇన్సల్ట్ చేస్తాడా? నేనేం బేవార్స్‌గా బలాదూర్‌గా తిరుగుతున్నానా? చూస్తుండు ఎప్పటికైనా సినిమా హీరోనవుతాను" అన్నాడు వెంకట్ మండిపడుతూ.

"అయితే అవుదువు లేరా! ముందు అన్నానికి రా" అన్నది సత్యవతి.

"ఇప్పుడప్పుడే మా వాడికి పెళ్లి చెయ్యం అంటే ఒక్క మాటతో పోతుంది గదా! నేనేదో చెడిపోయినట్లు క్రిటిసైజ్ చేస్తుంటాడు. ఇంటర్ పూర్తి చేయలేదంటాడు. అక్కినేని ఇంటర్ చదివాడా? డిగ్రీలున్నాయా? డాక్టర్ అయిపోలేదూ! హీరోకి చదువెందుకు?"

"సర్లేరా! నీ సోది ఆపు. తొందరగా వెళ్లి అన్నం తినేసి పడుకో. మళ్లీ మీ నాన్నొచ్చే వేళయింది" అన్నది సత్యవతి.

"ఛీ.. ఏదైనా సాధిద్దామంటే ఇంట్లో వాళ్లే కోపరేషన్ ఇవ్వరు. కళాకారులంటే అందరికీ చిన్నచూపు. 'ఆ నాటకాలేసే వాడా' అంటారు. వాడే సినిమాల్లోకెళ్లి తెరమీద కనిపిస్తే వాడు మావాడే అని నెత్తినెక్కించుకుంటారు" అని ఆక్రోశిస్తూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు వెంకట్.

* * *


తండ్రే కొడుక్కి వచ్చిన సంబంధాలు చెడగొడుతున్న ఘోర దురంతం గురించి మర్నాడు నాటక సమాజంలో చర్చ జరిగింది. వెంకట్ ప్రహ్లాదుడైతే, హరినారాయణ హిరణ్యకశిపుడనీ, వెంకట్ కళని ప్రేమిస్తుంటే అడ్డుపడుతున్న రాక్షసుడనీ, అంతిమ విజయం వెంకట్‌దేననీ అభిప్రాయపడ్డారు.

"నీకేం తక్కువరా? స్వంత ఇల్లుంది, మీ తాత ఇచ్చిపోయిన పంట పొలాలు, మామిడి తోటలున్నాయి. డబ్బు కావాలంటే మీ అన్న అమెరికా నుంచి డాలర్లు పంపిస్తాడు. నీ పెళ్లి మీ నాన్న చేసేదేంటి? నువ్వే లవ్ మేరేజ్ చేసుకుంటే పోలా?"

"లవ్ మేరేజ్ గూడా ఏ ముస్లిమ్ అమ్మాయినో, క్రిస్టియన్ పిల్లనో చేసుకో. మీ నాన్న తిక్క కుదురుతుంది. అటువంటి వాడికి తగిన శాస్తి జరగవలసిందే"

"ఎందుకైనా మంచిది. ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని చూసి లవ్ చెయ్యి. మీ నాన్న ఇంట్లో నుంచి గెంటేసినా రోజులు గడవాలి గదా! ఫుడ్‌కి ఇబ్బంది లేకుండా ఉంటుంది"

కాబోయే హీరోలు, కేరెక్టర్ ఆర్టిస్టులు, విలన్లు రకరకాల సలహాలిచ్చారు వెంకట్‌కి.



వెంకట్ పట్టపగలే డ్రీమ్ లోకి వెళ్ళిపోయాడు. తన పర్సనాల్టీ చూసి నెలకి పది వేలు సంపాదించే పడతి లవ్‌మేరేజ్ చేసుకున్నట్లూ, తల్లి లబోదిబోమని ఏడుస్తుండగా, తండ్రి ఈ ఇంట్లో నీకు స్థానం లేదని కేకలేస్తున్నట్లూ, తను తండ్రికి పెద్ద పెద్ద డైలాగ్స్ చెప్తున్నట్లు కలలో తేలిపోయాడు.

పగటికలలు నిజమవుతాయంటారు. అవుతాయేమో?

వెంకట్ వాళ్ల ఇంటికి ఎదురుగా ఉన్న ఇంటి వాళ్లు అమెరికాలో ఉంటారు. దాన్ని అద్దెకిచ్చి, అద్దె డబ్బు బ్యాంక్‌లో వేసే బాధ్యత హరినారాయణ మీద పెట్టి వెళ్లారు. ప్రస్తుతం ఆ ఇల్లు ఖాళీగా ఉంది. వెంకట్ ఆ ఇంట్లోకి వెళ్లి అద్దం ముందు పోర్షన్ బట్టీపడుతూ అభినయం ప్రాక్టీస్ చేస్తుంటాడు.

రోజులాగే 'కీ' స్టాండ్‌లో ఆ ఇంటి తాళం కనిపించలేదు. తల్లిని అడిగాడు.

"ఎవరో అద్దెకు దిగబోతున్నారు. మీ నాన్న వాళ్లకి తాళం చెవి ఇచ్చేశారు" అన్నది సత్యవతి.

"ఎవరమ్మా వాళ్లు?"

"ఎవరో ఇదుగో ఇందులో అడ్రస్ ఉంది చూడు" అని విజిటింగ్ కార్డు ఇచ్చింది సత్యవతి.

మిస్ సంతోషం, అసిస్టెంట్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా.

విజిటింగ్ కార్డు చదివిన వెంకట్‌కి పట్టపగ్గాల్లేవు. ఎగిరి గంతులేశాడు. సంతోషం అనే పేరు క్రిస్టియన్ అమ్మాయిలకే ఉంటుంది. ఇంటి ఎదురుగా ఉంటుంది కాబట్టి లైనేయడం ఈజీ. తను ఏదో ఒక వంక పెట్టుకుని పరిచయం పెంచుకుంటాడు. పరిచయం ప్రేమగా మారడం ఎంతసేపు?

ఆ రాత్రి వెంకట్‌కి సంతోషం కలలోకి వచ్చింది. ఆమె అచ్చు జూలియా రాబర్ట్స్‌లా ఉంది. మల్లెపూవు వంటి తెల్లటి గౌనులో మెరిసిపోతోంది. తను సూటు, బూటు వేసుకుని ఆమె చెయ్యి పట్టుకుని ఠీవిగా నడుస్తూ చర్చిలోకి ప్రవేశించాడు. చర్చి ఫాదర్ ఇద్దరితో పెళ్లి ప్రమాణాలు చేయించాడు. ఉంగరాలు మార్పించాడు. తను సంతోషం పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు.

"ఏంటే ఆ వెధవింకా నిద్రలేవలేదా? టైమెంతయింది? సూర్యోదయానికి ముందే నిద్ర లేవాలని తెలియదా? సోమరిపోతు.. సోమరిపోతని.. అందుకే దరిద్రం వాడికి. ఇంటర్ గూడా గట్టెక్కలేకపోయాడు"

హరినారాయణ కేకలకు వెంకట్ కల చెల్లాచెదురైపోయింది. హిరణ్యకశిపుడు మండిపడుతున్నాడు.

హరినారాయణ ఆఫీసుకి వెళ్లిపోయాక తల్లిని అడిగాడు వెంకట్.

"ఎవరమ్మా ఎదురింట్లో అద్దెకు దిగేది? ఎవరొచ్చి మాట్లాడారు?"

"ఎవరోరా ముసలాయన వచ్చి నాన్నని అడిగాడు. నాన్న ఇల్లు చూపించాడు. తమకు నచ్చిందన్నాడాయన. అడ్వాన్స్ ఇచ్చిపోయాడు" అన్నది సత్యవతి.

"ఎప్పుడొస్తారట?"

"ఏమో?"

"క్రిస్టియన్లటగా?"

"నీకెలా తెలుసురా?"

వెంకట్ నవ్వాడు. "నిన్న నువ్విచ్చిన కార్డులో ఉంది. ఆ ముసలాయన కూతురు పేరు

సంతోషం అట. ఆ పేరు పెట్టుకునేది క్రిస్టియన్లేగా?" అన్నాడు.

"మా నాయనే... మా నాయనే? పేరుని బట్టి కులం, మతం తెలుసుకున్నావా? నీ బుర్రలో ఎన్ని తెలివితేటలో!"

సత్యవతి కొడుకుని తెగ మెచ్చుకుంది. వెంకట్ సిగ్గుపడిపోయాడు.

వారం తర్వాత ఎదురింటి ముందు మారుతీకారు ఆగింది. దాని వెనుక లారీతో ఇంటి సామాను వచ్చింది.

వెంకట్ ఆసక్తిగా చూస్తున్నాడు.

మారుతీ కారులో నుంచి డెబ్బై ఏళ్లు పైన ఉన్న ముసలాయన తెల్లటి షర్ట్, ప్యాంట్ వేసుకుని దిగాడు. ఆయన వెనక నడివయసు ఆమె దిగింది. ఆమెకు ఏభై ఏళ్ల పైనే ఉంటాయి. బాబ్డ్ హెయిర్, రోల్డ్‌గోల్డ్ ఫ్రేమ్ కళ్లజోడు, సగం నెరిసిన జుట్టుతో నల్లగా ఉంది. గచ్చకాయ రంగు చీర, అదే రంగు బ్లౌజు వేసుకుంది. బహుశా ఆమె మిస్ సంతోషం తల్లి కావొచ్చు. మరి మిస్ సంతోషం ఎందుకు రాలేదు?

వెంకట్ వాళ్ల దగ్గరికి వెళ్లి "నమస్తే! అంకుల్! నమస్తే ఆంటీ! నేను ఎదురింట్లో ఉంటాను. హరినారాయణగారి అబ్బాయిని" అని పరిచయం చేసుకున్నాడు.

వాళ్లిద్దరు గూడా వెంకట్ గురించి అడిగారు. ట్రాన్స్‌పోర్ట్ వాళ్లు సామాను ఇంట్లో సర్దుతుంటే వెంకట్ ఇంటికెళ్లి ఫ్లాస్క్‌లో కాఫీ తెచ్చి సర్వ్ చేశాడు. వాళ్లు థాంక్స్ చెప్పారు.

"మీకు ఏ అవసరం వచ్చినా మొహమాటం లేకుండా చెప్పండి ఆంటీ!" అని ఆఫర్ ఇచ్చాడు వెంకట్.

"అలాగే మిస్టర్ వెంకట్!" అన్నది ఆమె.

"ఆంటీ మీ అమ్మాయి మిస్ సంతోషం రాలేదేమిటి? ఇయర్ మధ్యలో ఎందుకు ట్రాన్స్‌ఫరైంది? కావాలని ఈ ఊరొచ్చారా?" అని అడిగాడు వెంకట్.

ఆమె పకపకా నవ్వింది.

"మిస్టర్ వెంకట్! నేనే మిస్ సంతోషం" అన్నదామె.

వెంకట్ బిత్తర చూపులు చూస్తూ బొమ్మలా నిలబడిపోయాడు.

"నేను బ్యాచ్‌లర్‌ని. ఇంకా నాలుగేళ్లలో రిటైరవుతాను. ఈయన మా నాన్న రాబర్ట్. మిలటరీలో మేజర్‌గా రిటైరయ్యారు"

మిస్ సంతోషం మాటలు వెంకట్ బుర్రకి ఎక్కడం లేదు.

'ఆశ' నిరాశ ఐపోయిందనే ఆవేదన మొదలైంది. సంతోషంతో ప్రేమాయణం నడపాలని ఎన్ని కలలు కన్నాడు. కలలు కల్లలయ్యాయి. ఇప్పుడు లవ్ చేయడానికి మిస్ వీనస్‌నో, మిస్ విక్టోరియానో ఎక్కడ వెతకాలి అని వర్రీలో పడిపోయాడు వెంకట్.

వెంకట్ దిగులుగా, విచారంగా ఉన్నాడు. ముఖం వ్రేలాడేసుకుని రోడ్డు మీద నడుస్తుంటే అతని పక్కనే సరికొత్త ఇండికా కారు ఆగింది.

"వెంకట్!"

వెంకట్ కారులోకి చూశాడు. హరనాథ్. డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. ఖరీదైన బట్టలు, రేబాన్ కళ్లద్దాలు, చేతికి రాడో వాచీ, దర్జాగా ఉన్నాడు. వాడి చేతికున్న బ్రాస్‌లెట్, వేలికి డైమండ్ రింగ్ చూసి వెంకట్ కళ్లు బైర్లు క్రమ్మాయి.

"వెంకట్ ఏంటలా చూస్తున్నావ్? నేనురా హరనాథ్‌ని"

"హరనాథ్! అమెరికా నుంచి ఎప్పుడొచ్చావ్?"

"నాలుగు రోజులైందిలే. ముందు కారెక్కు" అన్నాడు హరనాథ్.

హరనాథ్ వాళ్ల నాన్న తాలూకా ఆఫీసులో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండేవాడు. హైస్కూల్లో చదువుకునేటప్పుడు డబ్బుకి చాలా ఇబ్బంది పడేవాడు. వాళ్ల నాన్న ఎలాగో కష్టపడి చదివించాడు. హరనాథ్ ఇంజనీరింగ్ చదివి అమెరికా వెళ్లాడు.

వెంకట్ కారెక్కాడు.

"ఏంట్రా? అదోలా ఉన్నావు?" అడిగాడు హరనాథ్.

వెంకట్ తన తండ్రి చిన్నచూపు చూడడం, తను హీరో కావాలని నటన మీద దృష్టి పెట్టటం, ఆఖరికి మిస్ సంతోషం టీనేజీ అమ్మాయనుకుని కలలు కనడం అన్నీ దాపరికం లేకుండా తన స్నేహితుడికి చెప్పాడు.

"వెంకట్... నువ్వు కలలు కనడం తప్పుకాదు. అబ్దుల్ కలాం యువకులను కలలు కనమన్నాడు. నిజమే. అవి ఇటువంటి కలలు కావు. మనకు సంపాదించుకునే శక్తి వచ్చే వరకు తల్లిదండ్రుల మీద, కుటుంబం మీద ఆధారపడొచ్చు. యువకులైన తర్వాత గూడా ఆధారపడడం వలన అందరూ చిన్నచూపు చూస్తారు. మనకి విలువ ఉండదు. కనే కలలు గూడా తన స్థోమతకు తగ్గట్టుగా ఉండాలి. ముందు నువ్వు నీ కాళ్ల మీద నిలబడాలని కలలు గను. ఏదైనా సాధించాలని కలలు కను. సంపాదించే భార్య కావాలని కలలు కనడం, అమాంతం హీరో కావాలని కలలు కనడం సరికాదు. మీ నాన్న నిన్ను చిన్నచూపు చూడడం నీ మంచి కోసమే. మీ అన్నను ఆదర్శంగా తీసుకో. కలలు కను. అవి నీ విలువ పెంచేట్లు ఉండాలి. సంతోషం కోసం, ఫాతిమా కోసం కలలు కని ఇంకా దిగజారిపోకు"

వెంకట్, హరనాథ్ వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు. అతని మనసులో ఆలోచనలు చెలరేగుతున్నాయి.



## తిరిగి సినిమాల్లో జ్యోతిక?

పెళ్లయ్యాక సినిమాలకు గుడ్‌బై చెప్పేసిన జ్యోతిక ఈమధ్యనే ఓ పాపకు తల్లి కూడా అయింది. ఈ సందర్భంలోనే కొత్త న్యూస్ ఏంటంటే- త్వరలోనే జ్యోతిక తిరిగి సినిమాల్లో నటించే అవకాశాలున్నాయని అంటున్నారు కోలీవుడ్ జనాలు. జ్యోతిక సినిమాల్లో రీఎంట్రీకి భర్త సూర్య కూడా సుముఖంగానే వున్నట్టు చెబుతున్నారు. డీసెంట్‌గా, నటనకు అవకాశం వుండే పాత్రల్నే జ్యోతిక చేయాలనుకుంటోందిట. సినిమాలకు గుడ్‌బై చెప్పడం మళ్లీ నటించడం తారలకు మామూలే కదా!